సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

శుక్రవారం । 7 । జూన్ । 2024



శాస్త్రోక్తంగా ఆర్జిత సేవలు

సింహగిరిపై శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి వారికి గురువారం ఆర్జిత సేవలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. 8లో



ఘనంగా ప్రత్యంగిరా హోమం

విశాఖ నగరంలోని లలిత పీఠంలో గురువారం శ్రీప్రత్యంగిరా భద్రకాళి హోమం నిర్వహించారు. 8లో



శిల్పారామానికి భారీ ఆదాయం

విశాఖ నగరంలోని శిల్పారామంకు మేనెలలో సందర్శకుల ద్వారా భారీ ఆదాయం సమకూరింది. 8లో

కార్యకర్తలకు అండగా కమిటీలు

ఏర్పాటుచేసిన వైఎస్సార్‌సీపీ అధిష్టానం

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో ఎన్నికల తరువాత భయానక వాతావరణం నెలకొంది. టీడీపీ దాడులతో రాష్ట్రంలో అత్యంత ఆందోళనకరమైన పరిస్థితులు నెలకొన్నాయి. ప్రభుత్వం ఏర్పాటుకాక ముందే టీడీపీ మూకలు రాష్ట్రవ్యాప్తంగా చెలరేగిపోతున్నాయి. ఎక్కడికక్కడ దాడులు చేస్తున్నాయి. దౌర్జన్యాలకు దిగుతున్నాయి. పార్టీ నాయకులు, కార్యకర్తలపై దాడులకు దిగుతూ అత్యంత పాశవికంగా ప్రవర్తిస్తున్నాయి. ఈ సమయంలో పార్టీ నాయకులకు, కార్యకర్తలకు తోడుగా నిలిచేందుకు 25 పార్లమెంట్ నియోజకవర్గాలకు కమిటీలను పార్టీ అధిష్టానం ఏర్పాటు చేసింది. ప్రతీ కార్యకర్త..ప్రతీ అక్కచెల్లెమ్మ, ప్రతీ అన్నదమ్ముడుతో పాటు సోషల్ మీడియా సైనికులకు ఈ కమిటీలు తోడుగా నిలుస్తాయి. బాధిత కుటుంబాలను పరామర్శించడమే కాకుండా వారికి అన్ని విధాలుగా న్యాయపరంగా, వైద్యపరంగా, అండగా నిలిచి ఆర్థికంగా సాయం అందిస్తాయి.

అరకు పార్లమెంట్ కమిటీలో సభ్యులు వీరే

కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, గుమ్మా తనూజారాణి (అరకు ఎంపీ), రేగం మత్స్యలింగం (అరకు ఎమ్మెల్యే), మత్స్యరాస విశ్వేశ్వరరాజు (పాడేరు ఎమ్మెల్యే), శత్రుచర్ల పరిక్షిత్‌రాజు, పాలవలస విక్రాంత్(ఎమ్మెల్సీ), కుంభా రవిబాబు (ఎమ్మెల్సీ), అనంత ఉదయ భాస్కర్ (ఎమ్మెల్సీ), పీడిక రాజన్నదొర, పాముల పుష్పశ్రీవాణి, నాగులపల్లి ధనలక్ష్మి, విశ్వసరాయి కళావతి, అలజంగి జోగారావును నియమించింది.

జగన్ వైపే గిరిజనం

జిల్లాలో వైఎస్సార్‌సీపీ ప్రభంజనం కొనసాగుతూనే ఉంది. అరకు, పాడేరు నియోజకవర్గాల ప్రజలు జగన్ వెంటే ఉన్నారని ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ రెండు నియోజకవర్గాల్లో 2014 నుంచి 2024 వరకు మూడు దఫాలుగా జరిగిన ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించారు.

- పాడేరు, అరకు నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ ఓటు బ్యాంక్ పదిలం
- 2014 నుంచి 2024 వరకు ఎన్నికల్లో అత్యధిక మెజారిటీలతో విజయం
- అభిమానాన్ని ఓటు రూపంలో చూపిస్తున్న గిరిజనులు
- కొనసాగుతున్న ప్రభంజనం



వైఎస్సార్‌సీపీ శ్రేణులతో అరకు ఎంపీగా విజయం సాధించిన గుమ్మా తనూజారాణి, అరకు ఎమ్మెల్యేగా గెలుపొందిన రేగం మత్స్యలింగం

అనంతగిరి: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా జిల్లాలోని పాడేరు, అరకు అసెంబ్లీలకు జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఓటు బ్యాంక్ పదిలంగానే ఉంది. ఈ రెండు నియోజకవర్గాల్లో ఊహించని మెజారిటీతో ఇద్దరు అభ్యర్థులు విజయం సాధించడం తెలిసిందే. గిరిజనులంతా ఓటు రూపంలో తమ అభిమానాన్ని ఓటు రూపంలో చూపించారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు పట్టం కట్టారు. జగనన్న వైపే గిరిజనులు ఉన్నారన్న విషయాన్ని ఈ ఫలితాలు స్పష్టం చేశాయి. గత 2014 నుంచి 2024 వరకు జరిగిన ఎన్నికల్లో గిరిజనులు వైఎస్సార్‌సీపీ వెన్నంటే ఉన్నారు.

పాడేరు అసెంబ్లీకి..

పాడేరు అసెంబ్లీకి 2014 నుంచి 2024 వరకూ వరుసగా మూడుసార్లు వైఎస్సార్‌సీపీకే ఓటర్లు పట్టం కట్టారు. 2014 ఎన్నికల్లో 2,13,796 ఓట్లకు 1,27,995 ఓట్లు పోలయ్యాయి. అప్పటి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గిడ్డి ఈశ్వరికి 52,384 ఓట్లు పోలయ్యాయి. సమీప ప్రత్యర్థి గొడ్డేటి దేముడుపై 24,141 ఓట్ల మెజారిటీతో ఆమె గెలుపొందారు.

- 2019 ఎన్నికల్లో 2,27,013 ఓట్లకు 1,40,319 ఓట్లు పోలయ్యాయి. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కొట్టగుళ్లి భాగ్యలక్ష్మికి 68,374 ఓట్లు వచ్చాయి. టీడీపీ అభ్యర్థి గిడ్డి ఈశ్వరికి 27,144 ఓట్లు రాగా ఈ ఎన్నికల్లో భాగ్యలక్ష్మి సుమారు 41 వేల మెజారిటీతో గెలుపొందారు.
- ప్రస్తుతం జరిగిన ఎన్నికల విషయానికొస్తే మొత్తం ఓట్లు 2,48,387 కాగా 1,58,747 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజుకు 67,333, టీడీపీ అభ్యర్థి గిడ్డి ఈశ్వరికి 47,468 ఓట్లు లభించాయి. విశ్వేశ్వరరాజు 19,865 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. 2019, 2024 ఎన్నికల ఫలితాలను పరిశీలిస్తే వైఎస్సార్‌సీపీ ఓటు బ్యాంక్ దాదాపుగా పదిలంగానే ఉన్నట్టు స్పష్టమవుతోంది.

అరకు అసెంబ్లీకి..

అరకు అసెంబ్లీలో కూడా వైఎస్సార్‌సీపీ ఓటు బ్యాంక్ నిలకడగానే ఉందని గత మూడు ఎన్నికల ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి.

- 2014 ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వచ్చినప్పటికీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కిడారి సర్వేశ్వరరావు బంపర్ మెజారిటీతో గెలుపొందారు. టీడీపీ నుంచి పోటీ చేసిన సివేరి సోమకు 29,647 ఓట్లు రాగా, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కిడారి సర్వేశ్వరరావుకు 63,700 ఓట్లు వచ్చాయి. దీంతో ప్రత్యర్థి సోమపై 34,053 ఓట్ల భారీ మెజారిటీతో సర్వేశ్వరరావు గెలుపొందారు.
- 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అదేపార్టీకి చెందిన అసెంబ్లీ అభ్యర్థి చెట్టి పాల్గుణ అత్యధిక మెజారిటీతో విజయం సాధించారు. స్వతంత్ర అభ్యర్థి సియ్యారి దొన్నుదొరకు 27,660 ఓట్లు వచ్చాయి. వైఎస్సార్‌సీపీ నుంచి పోటీచేసిన చెట్టి పాల్గుణకు 53,101 ఓట్లు వచ్చాయి. దీంతో ప్రత్యర్థులపై 25,441 ఓట్ల మెజారిటీతో ఆయన గెలుపొందారు.
- ప్రస్తుతం జరిగిన ఎన్నికల్లో కూడా వైఎస్సార్‌సీపీ తరపున పోటీ చేసిన రేగం మత్స్యలింగం అత్యధిక మెజారిటీతో విజయం సాధించారు. బీజేపీ అభ్యర్థి పాంగి రాజారావుకు 33,781 ఓట్లు రాగా, రేగం మత్స్యలింగానికి 65,658 ఓట్లు వచ్చాయి. ప్రత్యర్థిపై 31,877 ఓట్ల మెజార్టీతో మత్స్యలింగం విజయం సాధించారు.

ఎన్ని కష్టాలు ఎదురైనా అధినేత వెంటే..

కొయ్యూరు: ఎన్ని కష్టాలు ఎదురైనా వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి వెంటే తామంతా ఉంటామని చింతపల్లి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జె.రాజులమ్మ తెలిపారు. ప్రస్తుత ఎన్నికల్లో గెలుపొందిన పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు, అరకు ఎంపీ తనూజారాణికి అభినందనలు తెలుపుతూ కొయ్యూరులో గురువారం పార్టీ శ్రేణుల సమక్షంలో విజయోత్సవ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదవాడి కష్టాన్ని గుర్తించి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఘనత ఆయనకు దక్కుతుందన్నారు. ఏఎంసీ డైరెక్టర్ కమలమ్మ, ఉప సర్పంచ్ భవాని, మాజీ సర్పంచ్‌లు పల్లి చిన్నబ్బాయి, బచ్చల జగదీశ్వరి, వార్డు సభ్యులు లక్ష్మి, దేవి, జె లక్ష్మి, శివ, కె.అచ్యుత్, సాగర్, నాగమణి, చంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న రాజులమ్మ తదితరులు

ప్రాణాలను బలిగొంటున్న పిడుగులు

ఏజెన్సీలో కొద్ది రోజులుగా ఉరుములు, మెరుపులతో కురుస్తున్న వర్షాలు గిరిజనులను ఆందోళనకు కలిగిస్తున్నాయి. పిడుగులు ప్రాణాలను బలిగొంటున్నాయి. మూగజీవాలు మృత్యువాత పడటంతో పెంపకందారులకు తీవ్ర నష్టం మిగులుస్తున్నాయి.

- సంగోడిలో ప్రైవేట్ టీచర్ మల్లేశ్వరరావు మృతి
- మన్యంలో విస్తారంగా వర్షాలు
- ఉరుములు, మెరుపులతో ఆందోళన



పిడుగుపాటుకు మృతి చెందిన మల్లేశ్వరరావు(ఫైల్)

సాక్షి,పాడేరు: ఏజెన్సీ వ్యాప్తంగా విస్తారంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. వాగులు, గెడ్డలు పొంగి ప్రవహిస్తున్నాయి. పిడుగులు ప్రాణాలను పొట్టన పెట్టుకుంటున్నాయి. మండలంలోని మినుములూరు పంచాయతీ సంగోడి గ్రామంలో గురువారం పశువులను మేతకు తీసుకువెళ్లిన సీదరి మల్లేశ్వరరావు (38) అనే వ్యక్తి పిడుగుపాటుకు అక్కడికక్కడే మృతి చెందాడు. అతను పాడేరులోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు.

వై.రామవరంలో గృహోపకరణాలు ధ్వంసం

వై.రామవరం: మండలంలోని గురువారం ఉరుములు, పిడుగులతో కూడిన భారీ వర్షానికి ప్రజలు భయాందోళనకు గురయ్యారు. సుమారు రెండు గంటలపాటు జనజీవనం స్తంభించింది. మండల కేంద్రం వై.రామవరంలో రోలిపల్లి లక్ష్మి, బుజ్జి దంపతులకు చెందిన ఇంటిపక్కన చింతచెట్టుపై పిడుగు పడింది. ఈ శబ్దానికి వారి ఇంట్లోని టీవీ, కూలర్, ఫ్యాన్, వైరింగ్ నుంచి మంటలు వచ్చి ధ్వంసమయ్యాయి. జరిగిన నష్టాన్ని వీఆర్వో కాంతమ్మ పరిశీలించి తహసీల్దార్‌కు నివేదించారు.

మొండికోటలో పశువులు..

జి.మాడుగుల: మండలంలో సొలభం పంచాయతీ మొండికోట గ్రామ సమీపంలో బుధవారం సాయంత్రం అడవి మేతకు వెళ్లిన పశువుల్లో ఐదు పిడుగుపాటుకు మృతి చెందాయి. మొండికోట ప్రాంతంలో ఉరుములు, మెరుపులు, పిడుగులతో కూడిన వర్షానికి ప్రజలు భయాందోళన చెందారు. మొండి గ్రామానికి చెందిన సీదరి చిన్నారావుకు చెందిన ఐదు ఎద్దులు పిడుగుపాటుకు ప్రాణాలు కోల్పోయాయి. మేతకు వెళ్లిన అవి తిరిగి రాకపోవడంతో వెతకగా గ్రామానికి సమీపంలో మృతి చెంది ఉన్నాయి. దీనివల్ల సుమారు రూ.2 లక్షల నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం తక్షణ పరిహారం అందజేసి ఆదుకోవాలని బాధితుడు చిన్నారావు కోరారు.

కొయ్యూరు: మండలంలో గురువారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. కొయ్యూరు సమీపంలో పిడుగుపాటుకు టీవీలు, ఫ్యాన్లు దెబ్బతిన్నాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం నెలకొంది.



పాడేరులో కురుస్తున్న వర్షం



మొండికోట సమీపంలో పిడుగుపాటుకు మృతి చెందిన పశువులు



వై.రామవరంలో పిడుగుపాటుకు గురైన చింతచెట్టు



ధ్వంసమైన గృహోపకరణాలు

న్యూస్‌రీల్

మారథాన్ విజేతకు సత్కారం



కొర్రా గోపీని సత్కరిస్తున్న ఎంపీపీ శెట్టి నీలవేణి, ఎంపీడీవో నగేష్ తదితరులు

అనంతగిరి: మారథాన్ పోటీల్లో రాణిస్తున్న రొంపల్లి సచివాలయ వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ కొర్రా గోపీని గురువారం ఎంపీపీ శెట్టి నీలవేణి, ఎంపీడీవో నగేష్ సత్కరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. ఇటీవల కొర్రా గోపి ఖేలో భారత్ యూత్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలోని ఉత్తరప్రదేశ్ వారణాసిలో నిర్వహించిన 5కె మారథన్ పోటీల్లో స్వర్ణ పతకం సాధించాడు. దీనిని పురస్కరించుకుని వారు సత్కరించారు. ఏవో లక్ష్మీనారయణ, హౌసింగ్ ఏఈ నాగేశ్వరరావు, జూనియర్ రాజమ్మ, కార్యదర్శి శుభశేఖర్ పాల్గొన్నారు.

సింహాద్రిలో విద్యుదుత్పత్తి పునరుద్ధరణ

పరవాడ : సింహాద్రి ఎన్టీపీసీలో నాలుగో యూనిట్‌లో బుధవారం తెల్లవారు జామున సాంకేతిక కారణాలతో నిలిచిపోయిన విద్యుత్ ఉత్పత్తిని మరమ్మతుల అనంతరం తిరిగి గురవారం తెల్లవారు జామున పునరుద్ధరించారు. సంస్థలో 500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన నాలుగో యూనిట్‌లో బ్రాయిలర్‌లో అమర్చిన ట్యూబుకు రంధ్రం ఏర్పడడంతో బుధవారం తెల్లవారు జామున విద్యుత్ ఉత్పత్తికి అంతరాయం కలిగింది. సమస్యను గుర్తించిన సాంకేతిక నిపుణులు రంగంలోకి దిగి యూనిట్‌లో ఏర్పడిన రిపేర్లను త్వరితగతిన పూర్తి చేసి గురువారం తెల్లవారుజామున 3.55 గంటలకు నాల్గో యూనిట్‌లో విద్యుదుత్పత్తిని పునరుద్ధరించారు. ప్రస్తుతం సంస్థలో నాలుగు యూనిట్లు యథావిధిగా పనిచేస్తున్నాయని ఎన్టీపీసీ అధికారులు తెలిపారు.

బీసీజీ వ్యాక్సినేషన్ తీరు పరిశీలన

ఏయూ క్యాంపస్: రాష్ట్ర ప్రభుత్వ టీబీ సంయుక్త సంచాలకుడు డాక్టర్ టి.రమేష్ గురువారం నగరంలో ఆకస్మిక తనిఖీలు చేశారు. జిల్లాలో అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ జరుగుతున్న తీరును ప్రత్యక్షంగా పరిశీలించారు. విద్యానగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో శ్రామిక వీధి సచివాలయం, కాగితాల వారి వీధి సచివాలయంలో వ్యాక్సిన్ కూలర్, ఐఎల్ఆర్‌ను పరీక్షించారు. ఆయన సమక్షంలో పలువురు మధుమేహ, టీబీ బాధితులకు వ్యాక్సిన్ వేశారు. అనంతరం లాసన్స్ బే కాలనీలో పర్యటించి ఆరోగ్య సిబ్బంది వ్యాక్సిన్ వేసే విధానం, తదితర అంశాలను గమనించారు. అర్హులందరికీ వ్యాక్సిన్ వేయాలని ఆరోగ్య సిబ్బందికి సూచించారు. అనంతరం ఎంవీపీ కాలనీ సందర్శించి వ్యాక్సిన్ పంపిణీ జరుగుతున్న విధానాన్ని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు, పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

బయట పిల్లలను బడిలో చేర్పించాలి

- పాఠశాలలు తెరిచేనాటికి ప్రక్రియ పూర్తి
- ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు ఆదేశం

గంగవరం: అన్ని యాజమాన్యాల ప్రధానోపాధ్యాయులు బయట పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని ఏజెన్సీ డీఈవో వై.మల్లేశ్వరరావు ఒక ప్రకటనలో ఆదేశించారు. పాఠశాలలు తెరిచే నాటికి ఆయా ఆవాస ప్రాంతంలో ఉన్నటువంటి పిల్లలందరినీ కచ్చితంగా పాఠశాలల్లో నమోదు చేయాలని సూచించారు. ఈ నెల ఏడో తేదీ నుంచి ప్రతీ ఒక్కరు పాఠశాలలకు హాజరై డోర్ టూ డోర్ క్యాంపెయిన్ నిర్వహించాలని ఆదేశించారు. పాఠశాలలు తెరిచిన తర్వాత ఏ విధమైన అడ్మిషన్లు జరగకూడదన్నారు. పాఠశాలలకు తెరిచే నాటికే ఈ ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. మండల విద్యాశాఖ అధికారులు, సీఆర్పీలు అడ్మిషన్ల ప్రక్రియను పర్యవేక్షించాలని, ప్రతిరోజు నాలుగైదు పాఠశాలలను సందర్శించాలని సూచించారు. ఏ పాఠశాలలోనైనా ఉపాధ్యాయులు హాజరు కానట్టయితే తక్షణమే తెలియజేయాలని ఆదేశించారు. వారిపై ప్రాజెక్ట్ అధికారికి నివేదిస్తామని ఆయన పేర్కొన్నారు.

మలేరియా నివారణే లక్ష్యం

- డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా
- పాడేరులో అవగాహన ర్యాలీ



పాడేరు ఐటీడీఏ కార్యాలయం వద్ద ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో జమాల్‌బాషా, మలేరియా, వైద్యశాఖ అధికారులు,సిబ్బంది

సాక్షి,పాడేరు: జిల్లాలో మలేరియా జ్వరాల నివారణ లక్ష్యంగా పనిచేస్తున్నామని డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా తెలిపారు.మలేరియా మాసోత్సవాల ర్యాలీని గురువారం స్థానిక ఐటీడీఏ కార్యాలయం వద్ద ఆయన ప్రారంభించారు. పాతబస్టాండ్ అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. మలేరియా నివారణకు చేపడుతున్న కార్యక్రమాలు, అందిస్తున్న వైద్యసేవలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఈనెల 30 వరకు మలేరియా మాసోత్సవాలను విజయవంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. పీహెచ్‌సీలు, సబ్‌సెంటర్లు, వారపుసంతలు, ప్రధాన జంక్షన్లు, గ్రామాల్లో మలేరియాపై అవగాహన ర్యాలీలు చేపట్టాలని సూచించామన్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో దోమల వ్యాప్తి ఉంటుందని, ప్రజలు వాటి కాటుకు గురికాకుండా దోమతెరలను వినియోగించాలని సూచించారు.జూలై ఒకటో తేదీ నుంచి రెండవ విడత దోమల నివారణ మందు పిచికారి పనులు ప్రారంభిస్తామన్నారు. ప్రతీ శుక్రవారం డ్రైడే నిర్వహించాలని సూచించారు. మలేరియా,డెంగ్యూ జ్వరాలపై ప్రజలను అప్రమత్తం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. గ్రామాల్లో ఫీవర్ సర్వేలు జరపాలని, జ్వరపీడితులకు రక్తపరీక్షలు నిర్వహించాలన్నారు.జిల్లా మలేరియాశాఖ అధికారి పీఎస్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ మలేరియా సబ్‌యూనిట్ అధికారులంతా మలేరియా పీడిత గ్రామాలను తప్పనిసరిగా సందర్శించాలని ఆదేశించారు. అనంతరం ఐటీడీఏ సమావేశ మందిరంలో మలేరియా, డెంగ్యూ జ్వరాల నివారణకు సంబంధించి అధికారులతో సమీక్షించారు.జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి శేషయ్య, వీపీడీ కన్సల్టెంట్ జి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కొయ్యూరు: ఇక్కడ కేజీబీవీ ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరేందుకు ఎంపీసీ 20 సీట్లు ఖాళీ ఉన్నాయని ప్రత్యేకాధికారి పరిమళ గురువారం తెలిపారు. పది ఉత్తీర్ణత సాధించిన బాలికలు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ఆమె పేర్కొన్నారు. ఆసక్తి గల వారు నేరుగా కేజీబీవీకి రావాలని ఆమె సూచించారు. అనుభవం కలిగిన అధ్యాపకులతో బోధన ఉంటుందని ప్రత్యేకాధికారి పరిమళ పేర్కొన్నారు.

వసతిగృహాల్లో ప్రవేశాలకు..

ఎంవీపీకాలనీ (విశాఖ): జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వసతి గృహాల్లో ప్రవేశాలకు ఆ శాఖ ఉపసంచాలకుల కార్యాలయం గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి జిల్లాలోని 8 ప్రీమెట్రిక్, 14 పోస్ట్‌మెట్రిక్ వసతిగృహాల్లో ప్రవేశాలు కల్పించనున్నారు. ప్రీమెట్రికల్‌లో నాలుగు బాలురు, నాలుగు బాలికల వసతిగృహాల్లో 872, పోస్ట్ మెట్రిక్‌లో 7 బాలురు, 7 బాలికల వసతి గృహాల్లో 672 సీట్లు ఉన్నాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ వర్గాలకు రోస్టర్ ఆధారంగా ఈ ప్రవేశాలు కల్పించనున్నట్లు కార్యాలయం వెల్లడించింది. మరిన్ని వివరాలకు ఎంవీపీకాలనీ సెక్టార్-9లోని సాంఘిక సంక్షేమశాఖ ఉపసంచాలకుల కార్యాలయం, భీమిలిలోని సహాయ సాంఘిక సంక్షేమశాఖ కార్యాలయాన్ని సంప్రదించవచ్చు.

ముంపు మండలాల్లో ముందస్తు చర్యలు

- వరదలను సమర్థంగా ఎదుర్కొనేందుకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు
- కలెక్టర్ విజయ సునీత ఆదేశం
- అధికారులతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహణ



పాడేరు నుంచి వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడుతున్న కలెక్టర్ విజయసునీత




రంపచోడవరం నుంచి మాట్లాడుతున్న పీవో సూరజ్‌గనోరే


సాక్షి, పాడేరు/రంపచోడవరం: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వరదలు సంభవించే అవకాశాలు ఉన్నందున ముంపు మండలాలైన చింతూరు, వీఆర్‌పురం, కూనవరం, ఎటపాక ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఎం.విజయసునీత ఆదేశించారు. గురువారం ఆమె ముంపు మండలాల అధికార యంత్రాంగంతో కలెక్టరేట్ నుంచి వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరదలు సంభవించే పరిస్థితులు ఉన్నందున ఎలాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. గతంలో కంటే అధిక వర్షపాతం నమోదు అయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికార యంత్రాంగం మరింత అప్రమత్తం కావాలన్నారు. వరద ప్రభావం ఎక్కువగా ఉండే గ్రామాలను ముందుగానే గుర్తించి అక్కడ ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. నిత్యావసర వస్తువులు ముందస్తుగా పంపిణీ చేయాలని ఆదేశించారు. ప్రాణ,ఆస్తి నష్టాలు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. వరదలకు ముందు, తరువాత చేపట్టే కార్యక్రమాలపై ప్రణాళికలను సిద్ధం చేసి తమకు వెంటనే నివేదించాలని సూచించారు. నాలుగు మండలాల్లో 62 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాటు 16 బోట్లను సిద్ధం చేయాలని తహసీల్దార్లను ఆదేశించారు. సురక్షిత తాగునీటిని అందించడంతో పాటు బోరు మెకానిక్‌లు, మెటీరియల్‌ను అందుబాటులో ఉంచుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు.జిల్లా కేంద్రంతో పాటు రంపచోడవరం, చింతూరుతో పాటు ముంపు మండలాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ ముంపు మండలాల్లో వరదలపై పోలీసు యంత్రాంగం కూడా అప్రమత్తంగా ఉంటుందని తెలిపారు. సమాచార వ్యవస్థ దెబ్బతినే పరిస్థితుల్లో ఐటీడీఏలోని శాటిలైట్ ఫోన్లతో సమాచారం చేరవేస్తామన్నారు. ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలను అప్రమత్తం చేయడంతో పాటు వరద బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించేలా ప్రణాళికపరంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే మాట్లాడుతూ ముంపు ప్రాంతాల్లోని ప్రతీ మండల కేంద్రంలో బాధితులకు పునరావాస కేంద్రాలు ఏర్పాటుతోపాటు మూడు నెలల రేషన్ ముందస్తుగా జీసీసీ గోదాముల్లో నిల్వకు చర్యలు తీసుకున్నామన్నారు. పెట్రోల్, డీజిల్, లాంచీలు, ట్రాక్టర్లు ఎక్కడికక్కడ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పునరావాస కేంద్రాల్లో ఉండే వరద బాధితులకు ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తామని చెప్పారు. వరదలు సంభవించినప్పుడు సరఫరా నిలిపివేసేందుకు, తగ్గిన వెంటనే పునరుద్ధరణకు సిబ్బంది ప్రతీ మండలంలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఈ కాన్ఫరెన్సులో జాయింట్ కలెక్టర్ భావన వశిష్ట, చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య, డీఆరర్వో పద్మావతి, తహసీల్దార్లు, ఎంపీడీవోలు హాజరయ్యారు.

తస్మాత్ జాగ్రత్త

- అంతర్జాతీయ రైల్వే లెవెల్ క్రాసింగ్ వారోత్సవాలు ప్రారంభం
- జాగ్రత్తగా ఉండకపోతే కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించే యత్నం



అంతర్జాతీయ లెవెల్ క్రాసింగ్ వారోత్సవాల సందర్భంగా ప్రత్యేక అవగాహన ర్యాలీ



డీఆర్ఎం కార్యాలయం వద్ద వీధి నాటకం ప్రదర్శిస్తున్న సివిల్ డిఫెన్స్ సభ్యులు

విశాఖ: ప్రజల్లో అవగాహన కల్పించే దిశగా ప్రతి ఏడాది నిర్వహించే అంతర్జాతీయ లెవెల్ క్రాసింగ్ వారోత్సవాలు గురువారం రైల్వే వాల్తేర్ డివిజన్ పరిధిలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇంటర్నేషనల్ యూనియన్ ఆఫ్ రైల్వేస్ సహకారంతో ప్రపంచవ్యాప్తంగా ఈ వారోత్సవాలను ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది 'తస్మాత్ జాగ్రత్త.. ఒక్క క్షణంలో మీ జీవితం తారుమారు కావచ్చు' అనే నినాదంతో ప్రపంచవ్యాప్తంగా ఈ వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా వాల్తేర్ డివిజన్ సివిల్ ఇంజినీరింగ్ విభాగం, సేఫ్టీ పర్సనల్, సివిల్ డిఫెన్స్ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక ర్యాలీ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈనెల 9వ తేదీ వరకు డివిజన్ పరిధిలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. డీఆర్ఎం కార్యాలయం వద్ద గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కళాకారులు వీధి నాటకాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రజలు లెవెల్ క్రాసింగ్స్ వద్ద భద్రతాపరంగా అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. ప్రపంచంలోనే అత్యధిక నెట్‌వర్క్ కలిగిన రైల్వే భారతీయ రైల్వే అని, ట్రాక్‌లను దాటేటపుడు ప్రతీ ఒక్కరూ సురక్షిత విధానాలను పాటించాలని తెలిపారు. ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. సీనియర్ డివిజనల్ సేఫ్టీ ఆఫీసర్ సిద్ధార్థ ప్రధాన్ నేతృత్వంలో లెవెల్ క్రాసింగ్ గేట్స్ వద్ద, జన సమ్మర్దం ఉన్న చోట్ల, రైల్వే ట్రాక్స్ పరిసర ప్రాంతాల కాలనీలలో ప్రత్యేక అవగాహన డ్రైవ్స్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఏడీఆర్ఎం సుధీర్ కుమార్ గుప్తా పాల్గొన్నారు.

ప్రజల జీవన శైలిలో అనేక మార్పులు వచ్చాయి.. ఆహారపు అలవాట్లు కూడా చాలా వరకు మారిపోయాయి. ఇంటి భోజనం కంటే హోటళ్లు, దాబాలు, రెస్టారెంట్లు, బేకరీ ఫుడ్‌కు చాలా మంది ప్రాధాన్యమిస్తున్నారు. ఇదే ప్రధాన సమస్యగా మారుతోంది. నిల్వ ఉన్న పదార్థాలు, పలు రసాయనాలతో చేసిన వంటకాలు తిని రోగాల బారిన పడుతున్నారు. క్యాన్సర్ రోగుల్లో 53 శాతం మంది కల్తీ ఆహారంతోనే సమస్య తెచ్చుకున్నారని పలు సర్వేలు వెల్లడించడం ప్రమాద తీవ్రతను తెలియజెబుతోంది.

తళుకుల మాటున కల్తీ మాయ

- బయట దొరకని నాణ్యమైన ఆహారం
- అపరిశుభ్ర వాతావరణంలో వంటల తయారీ
- రంగు, రుచికోసం ప్రమాదకర రసాయనాల వాడకం
- సోకుతున్న రోగాలు
- హోటళ్లలో అధికారుల నామమాత్రపు తనిఖీలు



మహారాణిపేట: కొన్నాళ్ల కిందట వరకు ఎక్కడికైనా వెళ్లినా భోజనం సమయానికి ఇంటికి రాలేని పరిస్థితులు ఉన్నపుడే హోటళ్లలో తినేవారు. కొందరు ఎంత సమయమైనా ఇంటికి వచ్చే భోజనం చేసేవారు. బయటి ఆహారాన్ని తీసుకునే వారు కాదు. సంపాదనలో తక్కువ ఖర్చు చేసి, ఎక్కువ దాచుకునేవారు. ఇది ఆర్థికంగానూ, ఆరోగ్యం గానూ మంచి లక్షణమే. ఇప్పుడు 'కల్చర్' మారింది. 'సోషియల్ బిహేవియర్'లో తేడా వచ్చింది. నగరాలు, పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో కూడా 'పార్టీ కల్చర్' వచ్చింది. బర్త్ డే, మ్యారేజ్, ప్రమోషన్, ట్రాన్స్‌ఫర్...సందర్భం ఏదైనా 'పార్టీలు' ఇస్తున్నారు. ఇంటి భోజనం కంటే రెస్టారెంట్లలోని ఆహారం తినడానికే ప్రాధాన్యమిస్తున్నారు. నలుగురు స్నేహితులు కలిస్తే డిన్నర్ బయట చేస్తున్నారు. ఖరీదైన ఆహారం తింటున్నామనే భ్రమలో ఉన్నారు గానీ, ఆరోగ్యకర, పోషకాహారాన్ని తింటున్నామా? లేదా? అనేది గ్రహించలేకపో తున్నారు. నిల్వ ఉంచిన ఆహారం, ప్రమాదకర రసాయనాలు కలిపిన ఆహారాన్ని తీసుకుంటున్నారు. అప్పటికప్పుడు వీటివల్ల నష్టం లేకపోయినా దీర్ఘకాలంలో ప్రాణాంతక వ్యాధులబారిన పడే ప్రమాదం ఉంది.

అనుమతిలేని వ్యాపారాలు

హోటల్ ఏర్పాటు చేయాలంటే తప్పనిసరిగా ఆహార పరిరక్షణ, నాణ్యత ప్రమాణాల సంస్థ నుంచి అనుమతి తీసుకోవాలి. పరిశుభ్రత విషయంలో గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌కు దరఖాస్తు చేయాలి. ఈ శాఖలో నిర్ణీత రుసుము చెల్లించి అనుమతి పొందాలి. కానీ జిల్లాలో ఇలా అనుమతి తీసుకుని వ్యాపారం చేసే సంస్థలు నూటికి 25 శాతానికి మించి ఉండవనేది బహిరంగ రహస్యం. ఇదిలా ఉండగా పెద్ద హోటళ్లు, రెస్టారెంట్లు మినహా అధిక శాతం హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, రోడ్డుసైడు హోటళ్లలో పరిశుభ్రత గురించి అస్సలు పట్టించుకోవడం లేదు. నాసిరకం ఆహార పదార్థాలు వాడటం, రోజుల తరబడి ఫ్రిడ్జిలో నిల్వ ఉంచిన వేడి చేసి విక్రయిస్తున్నారు. ఆహారం వండే ప్రాంతాలూ తీవ్ర అపరిశుభ్రంగా ఉన్నా పట్టించుకునే నాథుడు లేడు. పట్టణాల్లో అధిక శాతం మురుగు కాలువలు, చెత్త కుప్పల పక్కన ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు దర్శనమిస్తున్నా అడిగే వారు కరువయ్యారు.

కల్తీ జరుగుతుంది ఇలా..

- పాలల్లో మున్సిపల్ కుళాయిలు, బోరు నీటిని కలుపుతారు. పాలల్లో చిక్కదనం కోసం నాసిరకం పాల పొడర్లు, యూరియా, పిండి, నూనె కలిపి విక్రయిస్తున్నారు.
- టీ పొడిలో ఇనుప రజను, రంపపు పొట్టును మిశ్రమం చేస్తున్నారు. దీనివల్ల ఊపిరితిత్తులు పాడైపోయే ప్రమాదం ఉంది.
- పశువుల ఎముకలను సేకరించి, వాటిని బట్టీల్లో అత్యధిక ఉష్ణోగ్రతపై మరిగించి ద్రావణాన్ని తీస్తున్నారు. ఆ ద్రావణాన్ని సాధారణ నూనెల్లో కలిపి విక్ర యిస్తున్నారు. దీనివల్ల జీర్ణకోశ వ్యాధులు వచ్చే అవకాశం ఉంది.
- చికెన్, మటన్ బిర్యానీలు, తందూరి చికెన్లలో ఆకట్టుకునేందుకు గాను ఎక్కువగా హానికరమైన రంగులను వాడుతున్నారు. అనారోగ్యానికి గురైన, ప్రమాదాల్లో చనిపోయిన గొర్రెలు, పొట్టేళ్లు, మేకలతో పాటు అనారోగ్యానికి గురైన వాటిని వధించి వినియోగదారులకు విక్రయిస్తున్నారు.
- నిషేధానికి గురైన క్యాట్‌ఫిష్‌లను సైతం చేపల విక్రయదారులు అమ్ముతున్నా అడిగే నాథుడు లేరు. వీటిని చికెన్, మటన్ వ్యర్థాలతో చెరువులు, నదుల్లో పెంచి పోషిస్తారు.
- మిరపకాయల్లో ఎరుపు రంగు రావడానికి సూడాన్ రంగులు వాడుతుంటారు. పసుపులో మెటానిల్ ఎల్లో అనే పదార్థాన్ని కలుపుతారు. వీటిని వంటలో వినియోగిస్తే క్యాన్సర్ సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. ఆహారాన్ని వండే సమయంలోనూ వండిన నూనెనే మళ్లీ మళ్లీ కాచి వండుతున్నారు. దీని వల్ల క్యాన్సర్, అల్సర్లు వచ్చే ప్రమాదమున్నా ఎవ్వరూ పట్టించుకోవడం లేదు.
- చిన్న చిన్న హోటళ్లు, కర్రీ పాయింట్లలో వేడి వేడి కూరలు, పప్పు, సాంబారు వంటి ఆహార పదార్థాలు పల్చటి పాలిథిన్ కవర్లలో వేసి ఇస్తున్నారు. పదార్థాల వేడికి ప్లాస్టిక్ కరిగి వాటిని తినే వారికి అనారోగ్యాన్ని కలిగిస్తున్నాయి.

నిబంధనలు బేఖాతర్

విశాఖపట్నం ప్రముఖ పర్యాటక ప్రాంతం. ఇక్కడ చిన్నా, పెద్ద హోటల్స్, రెస్టారెంట్స్, డాబాలు, చాట్, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, టిఫిన్ షాపులు లెక్కలేనన్ని ఉన్నాయి. వీటి ద్వారా ఏటా కోట్లాది రూపాయల వ్యాపారం జరుగుతోంది. వాస్తవానికి హోటళ్లు ఆహార పరిరక్షణ, నాణ్యత ప్రమాణాల సంస్థ నుంచి లైసెన్స్ తీసుకోవాల్సి ఉంది. ఆ శాఖ నిబంధనల మేరకు ఆహారం తయారు చేయాలి. ఈ చట్టం 2006 నుంచి అమల్లో ఉంది. ఆ శాఖ పరిధిలో జిల్లా స్థాయి అధికారితో పాటు ఓ గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్, మరో ఇద్దరు ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు ఉంటారు. వీరు నెలకు 12 శాంపిల్స్ సేకరించాలని ఉంది. వీరు సేకరించిన శ్యాంపిల్స్‌ను ప్రయోగశాలకు పంపి, పరిశీలన తర్వాత కేసులు నమోదు చేయాల్సి ఉంది. కల్తీని బట్టి క్రిమినల్ లేదా సివిల్ కేసులు నమోదు చేసి జరిమానాలు విధించే వీలుంది. అక్కడక్కడ.. అప్పుడప్పుడు మినహా పూర్తి స్థాయిలో తనిఖీలు జరగడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో విచ్చలవిడిగా ఆహారాన్ని కల్తీ చేస్తున్నారు.



ఇవి ప్రమాదకరం

- మెటానియల్ ఎల్లో వాడకం నిషేధం. కానీ వినియోగిస్తున్నారు. ఇది ఆరోగ్యంపై వెంటనే దుష్ప్రభావం చూపించదు. నెమ్మదిగా క్యాన్సర్‌కు కారకమవుతుంది. చిన్నారుల్లో నిద్రలేమి, నరాల సంబంధిత వ్యాధులు వస్తాయి.
- వంటకాల్లో రంగుకోసం వాడే నిషేధిత టార్‌టార్జిన్ చాలా ప్రమాదకరం. దీంతో మానసిక వ్యథ, థైరాయిడ్, క్యాన్సర్, ఎలర్జీ, దద్దుర్లు, తామర, రక్తకణజాలంలో హానికర కణజాలాల వృద్ధి చెందడం, డీఎన్‌ఏ నష్టపోవడం, నిద్రలేమి, నీరసం వస్తాయి.
- స్వీట్లు, బిస్కెట్లలో ఆరెంజ్ రంగు కోసం వాడే సన్‌సెటన్, పసుపు రంగు కోసం వాడే కాట్రాజ్, గ్రీన్ కలర్ కోసం వాడే బ్రిలియంట్ బ్లూ, టార్టాజిన్లు ప్రమాదకరమే
- చాక్లెట్లలో వాడే రోడ్‌మన్-బి కూడా ప్రాణాంతకమే! అయినా చాక్లెట్లు, చిన్నపిల్లలు తినే రంగుల ఆహారపదార్థాల్లో వీటిని వినియోగిస్తున్నారు.
- రెస్టారెంట్లు, బేకరీ ఆహారాన్ని వరసగా 40 రోజులు తింటే కీళ్లనొప్పులు, జీర్ణసంబంధిత వ్యాధులు వస్తాయి. మరింత అధికమైతే క్యాన్సర్ వచ్చే ప్రమాదముంది.

- అల్లం, వెల్లుల్లి పేస్టులను సైతం అక్రమార్కులు కల్తీ చేస్తున్నారు. వీటి ధర ఎక్కువగా ఉండటంతో అందులో ఆలుగడ్డ, ఉల్లిగడ్డ పేస్ట్‌లను కలుపుతున్నారు.

అనుమానం వస్తే ఫిర్యాదు చేయండి

నగరంలో గత ఏడాదిలో 119 కేసులు నమోదు చేశాం. పలు హోటళ్లు, రెస్టారెంట్లు, రిటైల్, హోల్‌సేల్ షాపులు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లకు జరిమానా విధించాం. ఎక్కడైనా ఆహారంలో కల్తీ జరిగిందని తెలిసి ఎవ్వరైనా ఫిర్యాదు చేస్తే అక్కడకు వెళ్లి శాంపిల్స్ సేకరిస్తున్నాం. ఆహారం కల్తీ జరగకుండా అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటున్నాం. వ్యాపారులను పిలిచి హెచ్చరిస్తున్నాం. ఎవ్వరికైనా అనుమానం వస్తే 98490 47761, 9912199284కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు.

– జి.ఎ.బి. నందాజీ, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్

ఘనంగా ప్రత్యంగిరా హోమం

సీతంపేట (విశాఖ) : నగరంలోని లలితపీఠంలో అమావాస్య సందర్భంగా గురువారం శ్రీప్రత్యంగిరా భద్రకాళి హోమం నిర్వహించారు. కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ స్వామి అనుగ్రహంతో పండితుల వేదమంత్రాల మధ్య హోమం శాస్త్రోక్తంగా జరిపారు. పరిసర ప్రాంత భక్తులు పాల్గొని భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. ఈ సందర్భంగా పీఠం విస్తరణాధికారి మన్నవ కృష్ణసేన్ మాట్లాడుతూ భక్తుల కోరిక మేరకు లలితపీఠంలో ప్రతీ నెల అమావాస్య రోజున ప్రత్యంగిరా భద్రకాళి హోమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శత్రు నాశనం, ఆర్థిక ఇబ్బందులు తొలగేందుకు, కోర్టు కేసుల్లో విజయం, ఉద్యోగ అభివృద్ధి విషయంలో శుభ ఫలితాల కోసం ఆది పరాశక్తి ప్రత్యంగిరాదేవి అనుగ్రహం పొందేందుకు హోమం నిర్వహించినట్టు తెలిపారు. హోమంలో పాల్గొన్న వారికి సర్వదుష్ట గ్రహ బాధలు, శత్రు ప్రయోగ బాధలు, ఆర్థిక, అనారోగ్య, కుటుంబ బాధలు తొలగిపోయి, కోరికలు తీరుతాయన్నారు. అలాగే ఉదయం పీఠంలో శనీశ్వరుని జయంతి సందర్భంగా శనీశ్వరునికి తైలాభిషేకం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు.

శిల్పారామానికి భారీ ఆదాయం

పీఎం పాలెం (విశాఖ) : మధురవాడ పరిసర ప్రాంతాల ప్రజలు సేద తీరేందుకు ప్రధాన వినోద, విహార కేంద్రంగా ఉన్న శిల్పారామం సందర్శకులను విశేషంగా ఆకర్షిస్తోంది. అంతే స్థాయిలో ఆదాయమూ సమకూర్చుకుంటోంది. నిర్వహణకు అవసరమైన ఆదాయం లభించని దుస్థితి నుంచి అనతి కాలంలోనే తేరుకుంది. రాష్ట్రంలోనే అధిక ఆదాయం సంపాదించే శిల్పారామంగా గుర్తింపు దక్కించుకుంది. గత రెండు సంవత్సరాలుగా సందర్శకుల తాకిడి రోజురోజుకూ రెట్టింపు అవుతోంది. గత సంవత్సరం మే నెల ఆదాయం రూ.3.53 లక్షలుకాగా... ఈ ఏడాది మే నెలలో రూ.5.83 లక్షల మేర ఆదాయం వచ్చిందని స్థానిక పరిపాలన అధికారి టి.విశ్వనాథ రెడ్డి తెలిపారు. మహిళలు, పిల్లల కోసం మరిన్ని హంగులతో శిల్పారామాన్ని సుందరంగా తీర్చిదిద్దుతామని ఆయన తెలిపారు.

ఉపాధి కూలీలపై తేనెటీగల దాడి

- 9 మందికి తీవ్ర గాయాలు
- ఎంపీపీ సాయంతో పీహెచ్‌సీకి తరలింపు



చేతులు, ముఖంపై గాయపరిచిన తేనెటీగలు

నాతవరం : ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలపై తేనెటీగలు దాడి చేసి 9 మందిని తీవ్రంగా గాయపరిచాయి. మండలంలో సరుగుడు గ్రామంలో గురువారం ఉదయం ఉపాధి కూలీలు, రైతులు వ్యవసాయ భూమిలో ట్రెంచ్‌లు ఏర్పాటు పనులు చేస్తున్నారు. ఆ సమయంలో అదే ప్రాంతంలో చెట్టుకు పట్టిన తేనెపట్టు చెలరేగి తేనె టీగలు పనులు చేస్తున్న కూలీలను గాయపరిచాయి. తీవ్రంగా గాయపడిన బూడి లక్ష్మణరావు, జయతి లక్ష్మి, జయితి కుమారి, మద్దెల నాగమణి, చిట్టుమూరి చింతల్లి, మద్దెల రాము, మద్దెల ఆనందరావు, పెయ్యల విజయ్, ఎస్.లక్ష్మణమూర్తిలను ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి సంఘటన స్థలానికి చేరుకోని వీరిని నాతవరం పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ వైద్యాధికారి ప్రసన్న వైద్య సేవలు అందించి ఇంటికి పంపించారు.

వారిలో బూడి లక్ష్మణరావు, జయితి విజయ్‌లను తేనెటీగలు తీవ్రంగా గాయపరచడంతో మెరుగైన వైద్యం అందించి వైద్యాధికారి ప్రసన్న పలు జాగ్రత్తలు సూచించారు.

ఆరు కిలోల గంజాయి స్వాధీనం

గోపాలపట్నం: బెంగళూరుకు గంజాయి తరలించేందుకు యత్నిస్తున్న వ్యక్తులను టాస్క్‌ఫోర్స్, ఎయిర్‌పోర్టు పోలీసులు అరెస్ట్ చేశారు. ఎయిర్‌పోర్టు పోలీసులు తెలిపిన వివరాలివీ.. కర్నాటకకు చెందిన కిరణ్‌కుమార్ చెన్నప్ప, శివరాజ్ గజేంద్ర ఒడిశా అరకు సమీపంలో శ్యామ్ సుందర్ కిముండి వద్ద ఆరు కిలోల గంజాయిని రూ.10 వేలకు కొనుగోలు చేశారు. గంజాయితో బెంగళూరు వెళ్లేందుకు ప్రయత్నించగా.. పక్కా సమాచారంతో ఎస్‌ఏడీ వద్ద టాస్క్‌ఫోర్స్, ఎయిర్‌పోర్టు పోలీసులు వారిని పట్టుకున్నారు. కిరణ్‌కుమార్ చెన్నప్ప, శివరాజ్ గజేంద్ర, శ్యామ్ సుందర్ కిముండిని అరెస్ట్ చేసి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సీఐ చక్రధరరావు నేతృత్వంలో కేసు దర్యాప్తు జరుగుతోంది.

శాస్త్రోక్తంగా ఆర్జిత సేవలు



స్వర్ణ పుష్పాలతో స్వామికి పూజ చేస్తున్న అర్చకుడు, భక్తులు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు శాస్త్రోక్తంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన సేవ ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్ఠింపజేసి 108 స్వర్ణ సంపెంగలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. పూజలో పాల్గొన్న ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. సింహాద్రి అప్పన్న స్వామికి గురువారం 9.30 గంటల నుంచి నిత్య కల్యాణం వైభవంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కల్యాణ మండపంలో వేదికపై ఉంచి విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అర్చకులు అందజేశారు.

ఉచిత శిక్షణ.. ఉపాధి కల్పన

శిక్షణ స్వల్పకాలమే... సొంత కాళ్లపై ఎదిగేలా తర్ఫీదు ఇస్తోంది. స్వయం ఉపాధి పొందేలా మార్గం చూపిస్తోంది. చేతిలో పట్టా ఉన్నా కొలువు దొరకని వారికి దర్జాగా బతికేలా భరోసా కల్పిస్తోంది. ఇలా ఎంతోమంది జీవితాల్లో ఉపాధి వెలుగులు నింపుతున్న ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ గ్రామీణ నిరుద్యోగులకు వరంగా మారింది.



అగరబత్తిలో శిక్షణ తీసుకుంటున్న మహిళలు

- వివిధ కోర్సుల్లో 9,031 మందికి తర్ఫీదు
- ఇంతవరకు 7,590 మందికి స్వయం ఉపాధి
- శిక్షణ కాలంలో ఉచిత భోజన, వసతి సౌకర్యం
- గ్రామీణ నిరుద్యోగులకు వరం
- అనకాపల్లిలో ఎస్‌బీఐ ఆర్‌ఎస్ ఈటీఐ శిక్షణ

అనకాపల్లి: డిగ్రీలు, పీజీలు చేసినా సరైన స్కిల్ లేక ఉద్యోగం, ఉపాధి దొరక్క దిక్కు తోచని స్థితిలో ఉన్నవారు.. ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో మధ్యలో చదువు ఆపేసిన వారు... నిరుత్సాహం పడాల్సిన పనిలేదు. ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ వివిధ ట్రేడ్‌ల్లో నైపుణ్య శిక్షణ ఇచ్చి స్వయం ఉపాధి కల్పిస్తోంది. అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారిలో 2009 జూలై 1న గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రారంభించింది. విశాఖ ఉమ్మడి జిల్లాలో గ్రామీణ ప్రాంత యువకుల ఉపాధి కల్పనకు బాటలు వేస్తోంది. సంస్థ ప్రారంభించినప్పటి నుంచి గ్రామీణ ప్రాంత యువకులకు శిక్షణ ఇస్తోంది. శిక్షణ అనంతరం వారు కోరుకున్న బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేయిస్తూ స్వయం ఉపాధి కల్పిస్తోంది. ఈ సంస్థకు చైర్మన్‌గా కలెక్టర్ వ్యవహరిస్తారు. 18–45 సంవత్సరాల మధ్య వయస్సుగల గ్రామీణ నిరుద్యోగులను మాత్రమే ఎంపిక చేసుకుని వివిధ ట్రేడుల్లో ఉచితంగా శిక్షణ ఇస్తారు. శిక్షణ కాలంలో ఉచిత భోజన, వసతి సౌకర్యాలు కల్పిస్తారు. సంస్థను ప్రారంభించి నాటి నుంచి నేటి వరకూ 9,031 మందికి శిక్షణ ఇచ్చారు. ఆయా వృత్తులలో నైపుణ్యం సాధించిన 7,590 మందికి బ్యాంకుల ద్వారా రుణం మంజూరు చేశారు. ముద్రా పథకం కింద ఒక్కొక్కరికి రూ.లక్ష నుంచి రూ.15 లక్షల వరకూ రుణ సదుపాయం కల్పించారు. 2024–25 సంవత్సరంలో నేటికి ఐదు బ్యాచ్‌ల్లో 136 మంది శిక్షణ పొందగా, నేటికి 24 మందికి ఉపాధి కలిగింది. ఈ ఏడాది మరింత మందికి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. శిక్షణ కాలంలో ఒక్క రూపాయి కూడా సంస్థ తీసుకోకుండా ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (ఎస్‌బీఐ, ఆర్‌ఎస్‌ఈటీఐ) ద్వారా అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు. పోటీ ప్రపంచంలో ఇటువంటి శిక్షణా కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని శిక్షకులు చెబుతున్నారు.

శిక్షణ వివరాలు

1.	ఉమెన్స్ టైలరింగ్	30 రోజులు
2.	బ్యూటీ పార్లర్	30 రోజులు
3.	ఎంబ్రాయిడరీ అండ్ ఫ్యాబ్రిక్ పెయింటింగ్	30 రోజులు
4.	జ్యూట్ బ్యాగ్‌ల తయారీ	13 రోజులు
5.	అగరబత్తి తయారీ	10 రోజులు
6.	కొవ్వొత్తుల తయారీ	10 రోజులు
7.	అప్పడాలు, పచ్చళ్లు, మసాలా పొడర్ల తయారీ	10 రోజులు
8.	పుట్టగొడుగుల పెంపకం	10 రోజులు
9.	పాడిపశువు, వానపాముల పెంపకం	10 రోజులు
10.	సెల్‌ఫోన్ రిపేరింగ్	30 రోజులు
11.	ఫొటోగ్రఫీ అండ్ వీడియోగ్రఫీ	30 రోజులు
12.	టూవీలర్ మెకానిజమ్	30 రోజులు
13.	హౌస్ వైరింగ్	30 రోజులు
14.	ఎల్.ఎం.వి.డ్రైవింగ్	30 రోజులు
15.	ఏసీ, ఫ్రిజ్‌ల సర్వీసింగ్	30 రోజులు
16.	మెన్స్ టైలరింగ్	30 రోజులు
17.	కంప్యూటర్ హార్డ్‌వేర్ అండ్ నెట్‌వర్కింగ్	30 రోజులు

బ్యూటీషియన్ కోర్సు నేర్చుకుంటున్నాను



ఇంటర్మీడియట్ వరకూ చదువుకున్నాను. కుటుంబంలో ఆర్థిక పరిస్థితులు కారణంగా స్వయం శక్తిపై ఎదగాలని ఆశతో ఉన్నాను. నాకు ఇష్టమైన బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ తీసుకుంటున్నాను. ఉచిత శిక్షణతోపాటు వసతి భోజనం కల్పిస్తారని నా స్నేహితురాలు చెప్పడంతో ఇక్కడ చేరాను. శిక్షణ అనంతరం సంస్థ ద్వారా మా ఇంటికి దగ్గరలో బ్యాంకు రుణం తీసుకుని బ్యూటీ పార్లర్ ఏర్పాటు చేసుకుంటాను.

– ఎ.హారిక, మత్స్యపురం గ్రామం, రావికమతం మండలం, అనకాపల్లి జిల్లా

టైలరింగ్ నేర్చుకుంటున్నాను



హుకుంపేటకు ఎస్‌బీఐ ప్రతినిధులు వచ్చి సమావేశం నిర్వహించారు. నిరుద్యోగ మహిళలకు శిక్షణలో ఉచిత భోజనం, వసతి కల్పిస్తామని చెప్పారు. మా కుటుంబ సభ్యులతో మాట్లాడి టైలరింగ్ శిక్షణకు వెళ్లాతానని చెప్పాను. శిక్షణ ఎంతో బాగా ఇస్తున్నారు. శిక్షణ పొందుతున్న మహిళలకు రెండు జతల యూనిఫాం ఉచితంగా అందజేశారు. వసతి, భోజనం బాగుంది. 30 రోజులు శిక్షణ పూర్తి చేసుకుని మా ఇంట్లోనే టైలరింగ్‌తో స్వయం ఉపాధి పొందాలని అనుకుంటున్నాను.

– ఓ.స్నేహిత, గూడ గ్రామం, హుకుంపేట మండలం, అల్లూరి సీతారామరాజు జిల్లా

ఎస్‌బీఐ శిక్షణ సంస్థ ఉపాధి కల్పించింది



నేను ఇంటర్ వరకు చదువుకున్నాను. కొన్నాళ్లపాటు ప్రైవేటు ఉద్యోగం చేశాను. కాని జీతం చాలకపోవడంతో కుటుంబాన్ని పోషించడానికి చాలా కష్టంగా మారింది. పెద్దగా చదువులేకపోవడంతో, చేతిలో సరైన నైపుణ్యం లేక ఏం చేయాలో తెలియక బాధపడేవాడిని. ఏదో చేయాలని అనుకునే సమయంలో మా స్నేహితుల ద్వారా అనకాపల్లి జిల్లా ఎస్‌బీఐ సంస్థలో ఉచితంగా సెల్‌ఫోన్ రిపేరింగ్ కోర్సులో శిక్షణ పొందాను. శిక్షణానంతరం డుంబ్రిగుడలో సెల్ పాయింట్ ఏడాది క్రితం ఏర్పాటు చేసుకుని సొంత ఊరిలో నెలకు రూ.20 వేల ఆదాయం సంపాదించుకుంటూ కుటుంబ సమేతంగా జీవిస్తున్నాను.

– కె.దామోదర్, డుంబ్రిగూడ మండలం, ఏఎస్ఆర్ జిల్లా..

గ్రామీణ నిరుద్యోగులకు ఉపాధి కల్పనే ఉద్దేశం



ఎస్‌బీఐ, ఆర్‌ఎస్‌ఈటీఐ సంస్థ ఏర్పాటు చేసినప్పటి నుంచి గ్రామీణ యువతకు 17 కోర్సుల్లో ఉచితంగా శిక్షణ ఇస్తున్నాం. ఉదయం 9 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకూ ఇస్తున్నాం. శిక్షణ కాలంలో ఉచిత భోజన వసతి, రెండు జతల యూనిఫాం, శిక్షణ పొందిన నిరుద్యోగులకు టూల్ కిట్స్ అందజేస్తున్నాం. నిరుద్యోగుల నుంచి మంచి స్పందన వస్తోంది. గ్రామీణ ఉమ్మడి విశాఖ జిల్లాలో వివిధ కోర్సుల్లో శిక్షణ పొందిన వారు చాలామంది నిరుద్యోగులను తీసుకువచ్చి చేర్పిస్తున్నారు. ఎస్‌బీఐ సంస్థ ఆదేశాల మేరకు గ్రామీణ నిరుద్యోగులకు ప్రాధాన్యమిస్తున్నాం. 7వ తరగతి పాస్, 10వ తరగతి పాస్ లేదా ఫెయిలైన వారు ఆధార్, తెల్లరేషన్ కార్డు కలిగి ఉండాలి.

– బి.విజయ్‌కుమార్, సంస్థ డైరెక్టర్, అనకాపల్లి